

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నర్సింహులు తదితరులు

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నగరాభివృద్ధి

బంజారాహిల్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నగరం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని ఆ పార్టీ జూబ్లీహిల్స్ డివిజన్ నాయకుడు నర్సింహులు అన్నారు. ఫిలింనగర్ బస్తీల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో టీడీపీ చాలా బలంగా ఉందని, నాయకులు పార్టీని వీడినప్పటికీ కార్యకర్తల బలం మాత్రం అలాగే ఉందన్నారు. సభ్యత్వాన్ని తీసుకునేందుకు అన్నివర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో సలీం, యాదగిరి, మల్లేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్‌భవన్ వద్ద నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు విశాల్ సుధాం, కృష్ణ, అరుణ్, మునీర్ తదితరులు

చలో రాజ్‌భవన్‌కు బేగంపేట డివిజన్ నేతలు

బేగంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ నిర్వహించిన చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో బేగంపేట డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సుధాం ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ.. అమెరికాలో అదానీ ఆర్థిక అవకతవకలకు పాల్పడి దేశం పరువు తీసినా ఎన్డీయే ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, అరుణ్, మునీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న వైద్య విధాన పరిషత్ చైర్మన్ అశోక్‌కుమార్

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన వైద్య విధాన పరిషత్ చైర్మన్

అమీర్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని ఏరియా ఆస్పత్రిని బుధవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అశోక్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుతున్న సేవలు, డాక్టర్లు, సిబ్బంది పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. సరైన వైద్య సేవలను అందుతున్నాయని, ఎలాంటి ఇబ్బందులు లేవని రోగులు వెల్లడించారు. దీంతో సంతృప్తి వ్యక్తం చేసిన అశోక్ కుమార్ ఆస్పత్రి ఆర్ఎంఓ వినాయకరావు, సూపరింటెండెంట్ రాహుల్‌ను అభినందించారు.



మడిగెల ముందు వేసిన టేబుల్స్, టార్పలిన్ సెట్లను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఎల్లమ్మ ఆలయం వద్ద బెంచీల తొలగింపు

అమీర్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'ఎల్లమ్మ భక్తులకు ట్రాఫిక్ కష్టాలు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఆలయం వద్ద మడిగెల ఎదుట వేసిన టేబుళ్లతో పాటు డేరాలను తొలగించారు. ఇకపై ఎవరైనా మడిగెల ముందుకు జరిగి టేబుళ్లను వేస్తే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

మానవత్వం చాటుకున్న హిందూ శ్మశానవాటికల సేవా సంఘం ప్రతినిధి

పంజాగుట్ట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన నిరుపేద వ్యక్తి అంత్యక్రియలను హిందూ శ్మశానవాటికల సేవా సంఘం ప్రతినిధులు బుధవారం నిర్వహించారు. ఖైరతాబాద్ ప్రేమ్‌నగర్ బస్తీకి చెందిన లక్ష్మణ్ అనే యువకుడు పెయింటింగ్ పనులు చేసుకుంటూ భార్య, తల్లి, చెల్లితో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. అంత్యక్రియలు నిర్వహించడానికి కుటుంబసభ్యుల వద్ద డబ్బులు లేక రోధిస్తుండటంతో ప్రేమ్‌నగర్ సీసీ కమిటీ వారు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12/13 హిందూ శ్మశానవాటికల సేవా సంఘం అధ్యక్షుడు, సామాజిక సేవకుడు రవీందర్‌కు విషయాన్ని వివరించారు. ఆయన స్పందించి మృతుడి కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం దగరుండి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 లోని హిందూ శ్మశానవాటికలో లక్ష్మణ్ అంత్యక్రియలను ఉచితంగా నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణకు వినతి



ఎస్సీ వర్గీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతి ఇస్తూ సుప్రీం కోర్టు వెలువరించిన చారిత్రాత్మక తీర్పును తెలంగాణలో వెంటనే అమలు చేయాలని కోరుతూ బల్కంపేటకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు మోత్కుపల్లి రమేష్, రామేశ్వరం రమేష్ తదితరులు ఏకసభ్య కమిషన్ చైర్మన్ సమీమ్ అక్తర్ కు వినతిపత్రం అందజేశారు.

- అమీర్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి)

మందుబాబుల నయా ఎత్తులు!

- పోలీసుల కన్నుగప్పి బయటపడేందుకు మార్గాల అన్వేషణ
- వాట్సాప్ గ్రూపుల్లో డ్రంకెన్ డ్రైవ్ సమాచారం
- వారి ఎత్తుగడలను పసిగట్టిన ట్రాఫిక్ పోలీసులు
- తప్పించుకోలేకపోతున్న వాహనదారులు

బంజారాహిల్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ పరిధిలో ఇటీవలి కాలంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారు భారీ సంఖ్యలో పటుబడుతున్నారు. గత పది నెలల కాలంలో చాలా మందికి జైలుశిక్ష సైతం పడింది. వీరిలో ఉన్నత కుటుంబానికి చెందిన యువకులు, ప్రముఖ కంపెనీల్లో పనిచేసే ఐటీ ఉద్యోగులు ఉన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో అమ్మాయిలు సైతం పట్టుబడుతున్నారు. బుద్ధిమంతుడిగా కుటుంబంలో పేరున్న ఓ యువకుడి పరిస్థితి జైలుశిక్షతో అయోమయంగా మారింది. కొత్త కల్చర్ పుణ్యమాంటూ సాయంత్రం అయితే చాలు చాలా మంది యువత నాలుకపై చుక్క పడాల్సిందే. ఏదో ఒకరోజు అయితే పర్లేదు కానీ.. రోజూ మందేయకుండా ఇల్లు చేరటం ఎలా! అందుకే.. కుర్రకారు కొత్త మార్గాలు ఎంచుకున్నారు. ఒకరిద్దరు బయటకు వచ్చి ఏ రూట్స్‌లో పోలీసులు తనిఖీ చేస్తున్నారనే విషయాన్ని గమనిస్తారు. కొందరు దూరంగా ఉండి పరిస్థితిని అంచనా వేస్తారు. వెంటనే అదే విషయాన్ని వాట్సాప్ ద్వారా తమ బ్యాచ్‌కు సమాచారం అందిస్తారు. ఎంచక్కా పోలీసులకు మస్కాకొట్టి మరో మార్గంలో ఇల్లు చేరుతున్నారు. దాదాపు నెలరోజులుగా ఇదే తంతు. అనుమానం వచ్చిన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు అసలు కిటుకును గుర్తించారు. అంతే.. ఫలానా చోట తనిఖీలంటూ అక్కడ కొందరు కానిస్టేబుల్స్‌ను ఉంచుతున్నారు. మరో మార్గంలో తనిఖీలు చేపడుతున్నారు. దీంతో అటువైపు వెళ్లకుండా మందుబాబులు తనిఖీల్లేవనే ధైర్యంతో పోలీసులున్న వైపు వెళ్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడుతున్నారు. కొద్దిరోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ఏకంగా 62 మంది మందుబాబులు వాహనాలను నడుపుతూ పట్టుబడటమే ఇందుకు నిదర్శనం.

యువత కొత్త ఎత్తుగడలు..

మద్యం మత్తులో వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రాఫిక్ పోలీసులు నగరంలో డ్రంకెన్ డ్రైవ్‌లు చేపడుతున్నారు. వీకెండ్‌లో అయితే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌తో పాటు నగరంలో వివిధ ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు విస్తృతంగా చేస్తున్నారు. పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కోర్టులో జరిమానా లేదా జైలు శిక్ష పడుతుండటంతో వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపాలంటే భయపడుతున్నారు. అయితే కొందరు మాత్రం బ్రేక్ ది రూల్స్ అన్నట్టు పోలీసుల తనిఖీలను తప్పించుకునేందుకు ఎత్తుగడ మొదలు పెట్టారు. వీకెండ్‌లో మస్తుగా పార్టీలు చేసుకొని పోలీసులకు చిక్కకుండా ఏఏ దారిలో తనిఖీలు జరుగుతున్నాయో వాట్సాప్ ద్వారా షేర్ చేసుకుంటున్నారు. కొందరు తనిఖీలు జరుగుతున్న ప్రాంతాలను రూట్ మ్యాప్‌లుగా మార్చి వాట్సాప్‌లో సందేశాలు పంపించుకుంటున్నారు. తనిఖీలు జరగని మార్గాల్లో వెళ్తూ తప్పించుకుంటున్నారు.

కొందరికి ఉపాధిగా మందుబాబుల అవసరం..

డ్రంకెన్ డ్రైవ్ నుంచి తప్పించుకునేందుకు మందుబాబులు చేసున్న ప్రయత్నాలను కొందరు తమకు ఆదాయ నవరులుగా చేసుకుంటున్నారు. డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించే ప్రాంతానికి కొద్ది దూరంలో కొంతమంది డ్రైవర్లు నిలబడి కార్లను ఆపుతూ తనిఖీల గురించి వివరిస్తున్నారు. తనిఖీల నుంచి తప్పించేందుకు తాము డ్రైవ్ చేస్తామని చెబుతూ మూడు వందల నుంచి ఐదు వందల రూపాయల వరకు ఛార్జ్ చేస్తున్నారు. మద్యం తాగి ఉండటంతో వాహన చోదకులు సైతం ఒప్పుకుంటున్నారు. ద్విచక్ర వాహనదారులు సైతం ఇలాంటి డ్రైవర్లను ఆశ్రయిస్తున్నారు. కొంత మంది ఇదే అదనుగా భారీగా ఛార్జ్ చేస్తున్నట్టు సమాచారం.



శ్వాస పరీక్ష నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

చెక్ పెడుతున్న పోలీసులు..

వీకెండ్‌లో వాహనాల తనిఖీల్లో ఈ మధ్య కేసులు తగ్గడం మొదలయ్యాయి. దీంతో మద్యం తాగి వాహనాలు నడిపే వారి సంఖ్య తగ్గుతుందని, ఇది మంచి పరిణామమని పోలీసులు భావించారు. అయితే మార్పు నిజమేనా అని పోలీసులకు అనుమానం వచ్చింది. దీనిపై విచారించగా అసలు విషయం తెలిసింది. వాట్సప్, అద్దె డ్రైవర్లతో తప్పించుకుంటున్నట్టు తేలింది. దీంతో పోలీసులు కూడా ట్రాక్ మార్చారు. గతంలో డ్రంకెన్ డ్రైవ్ నాలుగు గంటల పాటు ఒకే ప్రాంతంలో నిర్వహించే వారు. శుక్ర, శనివారాల్లో తనిఖీల గురించి సాయంత్రమే ప్రకటించేవారు. అయితే ఇప్పుడు ఈ పద్ధతికి స్వస్తి పలికారు. డ్రంకెన్ డ్రైవ్ ఎక్కడ నిర్వహిస్తారు అన్న విషయం చివరి నిమిషం వరకు చెప్పడం లేదు. గంటకోసారి తనిఖీ ప్రాంతాన్ని మార్చుతున్నారు. ముఖ్యంగా ప్రధాన రోడ్లకు ప్రత్యామ్నయంగా ఉపయోగించే దారుల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో రెండు వారాల నుంచి కేసుల సంఖ్య పెరిగింది. రెండు వారాల్లో దాదాపు 265 కేసులు నమోదయ్యాయి.

తనిఖీలు పకడ్బందీగా చేస్తున్నాం



డ్రంకెన్ డ్రైవ్ నుంచి తప్పించుకునేందుకు చాలా మంది ప్రత్యామ్నయ దారులు వెతుకుతున్నారు. వాటికి తగ్గట్టుగానే మేమూ ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రధాన రోడ్లతో పాటు ప్రత్యామ్నయ దారుల్లోనూ తనిఖీలను ముమ్మరం చేశాం. మద్యం తాగే వారి భద్రత కోసమే డ్రైవ్ చేపడుతున్నాం. మద్యం తాగేవారు డ్రైవర్లను నియమించుకోవడం లేదా క్యాబ్‌లో ఇంటికి వెళితే అందరూ సురక్షితంగా ఉంటారు. దీనికి తగ్గట్టు వాహనచోదకులు నడుచుకుంటే బాగుంటుంది. వారి తీరు మార్చుకోకుంటే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లే అవుతుంది.

- కట్టా హరిప్రసాద్, పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ

హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- యూనియన్ నేతల డిమాండ్
- సివిల్ సప్లయ్ భవన్‌ను ముట్టడించిన కార్మికులు
- జనవరి 1 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరిక



సోమాజిగూడలోని సివిల్ సప్లయ్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పంజాగుట్ట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్లతో జరిగిన హమాలీ రేట్ల పెంపు అంగీకార ఒప్పందాన్ని అమలుచేయాలని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని వివిధ గోడౌన్‌లలో పని చేస్తున్న హమాలీ కార్మికులు బుధవారం సోమాజిగూడలోని సివిల్ సప్లయ్ భవన్‌ను ముట్టడించారు. వారు కార్యాలయం లోపలికి వెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ మాట్లాడుతూ.. హమాలీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కూలీ రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. తమ పోరాటాల ఫలితంగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌తో జరిగిన ఒప్పందం ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జనవరి నెల నుంచి రేట్లు పెంచాలని, కార్మిక సంక్షేమ పథకాలను అమలుచేయాలన్నారు. ఈ నెల 31 లోపు జీవో విడుదల చేసి బకాయిలను చెల్లించకుంటే జనవరి 1 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామంటూ యూనియన్ నాయకులు అధికారులకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైఓమయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, కార్మికులు పాల్గొన్నారు.



తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఉద్యోగులు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో బుధవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాస్టర్ జోసెఫ్ ఎడ్వర్డ్, ఇన్‌చార్జి డైరెక్టర్లు సాయిబాబా, సుధామాధురి, చీఫ్ ఇంజనీర్లు రంగనాథ్ రాయ్, నరసింహస్వామి, శివాజీ, బాలస్వామి, భాస్కర్, సీజీఆర్ఎఫ్ మెంబర్స్ లలిత, కె.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో..

ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎండీ అశోక్ రెడ్డి హాజరై వాటర్‌బోర్డు వినియోగదారులు, ఉద్యోగులు, సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ జనాభాలో 30 శాతానికి పైగా యేసుక్రీస్తును విశ్వసిస్తారని, కాలాన్ని సైతం యేసుక్రీస్తు పుట్టుక ఆధారంగా కొలుస్తారని చెప్పారు. క్రైస్తవం సేవకు మరోపేరు లాంటిదని, ఎంతో మంది మిషనరీలు మన దేశంలో సేవ చేశారని గుర్తుచేశారు. జీఎం ఏజే సుగంధిని ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్ కుమార్, సుదర్శన్, జీఎంలు మాణిక్యం, వసంత, డీజీఎంలు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ డబుల్‌బెడ్‌రూమ్ సముదాయంలో నీళ్ల కోసం బారులు తీరిన మహిళలు

తాగునీటికి తీవ్ర ఇబ్బందులు

- మరమ్మతుల పేరుతో ఐదు రోజులుగా నీరు వదలని అధికారులు
- ఎమ్మెల్యే స్పందించి బోర్ వేయించాలని కోరుతున్న ప్రజలు

ఖైరతాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో నీటి సమస్య అధికంగా ఉంది. 4 బ్లాకుల్లో 210 ఇళ్లు ఉండగా అన్నింటికీ కలిపి ఒకే బోరు ఉండడంతో నీరు సరిపోవడం లేదు. గత 4 రోజులుగా పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా జలమండలి అధికారులు తాగునీటిని వదలడం లేదు. దీంతో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో నివసించేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అయితే ఇక్కడ మరో పవర్ బోరు కావాలని స్థానికులు కోరగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బోరు వేయించారు. అయితే అక్కడ నీరు రాకపోవడంతో నిపుణుల ద్వారా పరిశీలించి నీరు ఉన్న ప్రాంతాన్ని గుర్తించి బోరు వేయిస్తామని చెప్పారు. అయితే సంవత్సరం దాటినా బోరు వేయకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం జలమండలి ఆధ్వర్యంలో నీటి ట్యాంకర్ వచ్చిన సమయంలో స్థానికులు భారీ సంఖ్యలో బారులు తీరారు. మరోవైపు తాగునీరు రాకపోతుండటంతో స్థానిక బస్తీలైన మహాభారత్ నగర్, ఇందిరానగర్, బీజేఆర్ నగర్, గాంధీనగర్ తదితర బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

బంజారాహిల్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందిరానగర్ గాంధీబొమ్మ వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు బంజారాహిల్స్ ఎస్ఐ యాసీన్‌కు సమాచారం అందింది. వెంటనే ఆయన తన సిబ్బందితో కలిసి ఇందిరానగర్‌కు చేరుకున్నారు. అక్కడ ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ.20 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులు సౌబంధి ప్రేంకుమార్, బానోతు లక్ష్మణ్‌నాయక్, లక్కన్ మాలేకర్‌గా గుర్తించారు. రెండు సెల్‌ఫోన్‌లు, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డ్రైవర్‌పై కానిస్టేబుల్ దాడి

బంజారాహిల్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డ్రైవర్‌పై కానిస్టేబుల్ రాయితో దాడి చేసి గాయపర్చాడు. అంబర్‌పేటకు చెందిన కానిస్టేబుల్ మహ్మద్ అక్రమ్ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవిగుప్తా వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న రవిగుప్తాను జూబ్లీహిల్స్‌లోని ఇంట్లో దించి రోడ్డు నంబర్ 10 మీదుగా వెళ్తుండగా ఓ ద్విచక్రవాహనం అడ్డుగా వచ్చింది. అక్రమ్ కారు ఆపి మాట్లాడేందుకు ప్రయత్నించగా వాహనంపై వచ్చిన వ్యక్తి దాడి చేసి పారిపోయాడు. నిందితుడి గురించి వాకబు చేయగా అతడు మూడో బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బ్రహ్మం అని తేలింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధం

ఖైరతాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధమైన ఘటన ఖైరతాబాద్ నెహ్రూ నగర్‌లో చోటుచేసుకుంది. నెహ్రూనగర్ వాంబే గృహ సముదాయం ఈ బ్లాక్ మొదటి అంతస్తులోని ఓ ఇంట్లో అనామిక, హనుమాన్ దంపతులు నివసిస్తున్నారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో తాళం వేసి ఉన్న వారి ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు డోర్ ఓపెన్ చేసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ప్రయోజనం లేకపోవడంతో అగ్ని మాపక శాఖకు సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో ఫ్రిడ్జ్, టీవీ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, బీరువాలోని బట్టల తో పాటు పలు వస్తువులు కాలి బూడిదయ్యాయి. నష్టపోయిన కుటుంబాన్ని ఆదుకోవాలని కార్పొరేటర్ విజయారెడ్డితో పాటు స్థానికులు రెవెన్యూ అధికారులను కోరారు.



పోలీసుల అదుపులో సట్టా నిర్వాహకులు, పంటర్లు

సట్టా నిర్వహిస్తున్న ముఠా అరెస్ట్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సట్టా నిర్వహిస్తున్న నిర్వాహకులతో పాటు పంటర్లను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, షాహినాత్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ధూల్‌పేట జుమ్మేరాత్‌బజార్ ప్రాంతానికి చెందిన విశాల్ సింగ్(26) విగ్రహాల తయారీతో పాటు, విక్కీ పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అదనపు సంపాదన కోసం పాన్‌షాప్‌లో ఉన్న గదిలో సట్టా బెట్టింగ్‌లు తీసుకుంటున్నాడు. ఇతడికి తాడ్‌బన్‌కు చెందిన నరేష్‌కుమార్ చౌహాన్(24), ధూల్‌పేటకు చెందిన అంకిత్‌సింగ్ (22), అక్షయ్‌సింగ్(26)లు పంటర్ల నుంచి బెట్టింగ్‌లు తీసుకుంటూ సహకరించేవారు. వీరి దందా గురించి పక్కా సమాచారమందుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, షాహినాత్‌గంజ్ పోలీసులు కలిసి నలుగురు నిర్వాహకులతో పాటు మరో 20 మంది పంటర్లను అరెస్ట్ చేశారు. మట్కా లాటరీ చార్ట్, లాటరీ చిట్టు, సట్టా చిట్టు, రూ.30,760 స్వాధీనం చేసుకున్నారు.



సీడీపీవో డాక్టర్ స్వప్నకు వినతిపత్రం అందజేస్తున్న తల్లుల సంఘం, బాలల హక్కుల ప్రతినిధులు

అంగన్‌వాడీ కేంద్రాలలో అన్నీ సమస్యలే

అడ్డగుట్ట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లు, ఆయాలను నియమించాలని తల్లు సంఘం ప్రతినిధులు, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతనిధులు కోరారు. అంగన్ వాడీ కేంద్రాలలో అన్నీ సమస్యలే ఉన్నాయని వారన్నారు. తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్య, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు రాష్ట్ర కో- కన్వీనర్ రమాదేవి, మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్, యువ రత్నాల కమిటీ ప్రతినిధి సంతోష్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు సువర్ణ, భాగ్య బుధవారం సికింద్రాబాద్ సీడీపీవో డాక్టర్ స్వప్నను కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లు ఉంటే, ఆయాలు ఉండరని, మరికొన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయాలు ఉంటే టీచర్లు ఉండరని వారన్నారు. ఇటీవల తాము చేపట్టిన సర్వేలో తుకారాం గేట్ గడ్డమీదిబస్తీలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఆయా ఇద్దరు కనిపించలేదన్నారు. మరో సెంటర్‌లో ఇన్‌చార్జి టీచర్లు పనిచేస్తున్నారని సీడీపీవోకు వివరించారు. అంగన్‌వాడీ సెంటర్లలో విద్యార్థులకు గుడ్లు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం కూడా అందజేయడం లేదని సీడీపీవో దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన సీడీపీవో త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచినట్టు వారు తెలిపారు.



కళ్ల అద్దాలు అందుకున్న వారితో రోటరీ క్లబ్ ప్రతినిధులు

కంటి చూపుపై శ్రద్ధ వహించాలి

చిలకలగూడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కంటిచూపుపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని రోటరీ క్లబ్ ప్రతినిధులు సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో మెట్టుగూడ డివిజన్, దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో కంటి వైద్యశిబిరం బుధవారం ఏర్పాటు చేశారు. అక్కడికి వచ్చిన ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ల అద్దాలను అందజేశారు. ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి, గౌరవ అతిథిగా డైరెక్టర్ సర్వీసెస్ రాజాకృష్ణ పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచి తరచూ కంటి పరీక్షలు చేయించుకోవడం వలన దృష్టిలోపాలను నివారించొచ్చని అన్నారు. అశ్రద్ధ వహిస్తే కంటి చూపు కోల్పోయే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి డాక్టర్ ఆనంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు మల్లేశ్వరీ, హసీనాబేగం బస్తీనాయకులు మల్లేష్, కుమార్ పాల్గొన్నారు.



అయ్యప్ప పడిపూజలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తదితరులు

మడ్‌పోర్ట్‌లో అయ్యప్ప పడిపూజ

సికింద్రాబాద్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): సిఖ్‌విలేజ్ మడ్‌పోర్ట్ మహాకాళీ ఆలయ ఆవరణలో గురుస్వామి యాదగిరి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పస్వామి పడిపూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులపై అయ్యప్పస్వామి కరుణ కటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నర్సింగ్, శివ, రాము, డి.నర్సింగ్, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ సిబ్బందికి విశిష్టసేవా పురస్కారాలు

దక్షిణ మధ్యరైల్వే నుంచి నాగార్జునరెడ్డి, హుసేనయ్య ఎంపిక



నాగార్జునరెడ్డి ఆర్పీఎఫ్ ఎస్ఐ



హుసేనయ్య హెడ్ కానిస్టేబుల్

హైదరాబాద్ సిటీ/సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో అంకితభావంతోపాటు ప్రతిభావంతమైన సేవలందించిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందికి భారతీయ రైల్వే విశిష్ట సేవా పురస్కారాలను ప్రకటించింది. వీరికి ఇచ్చే రైల్వే మంత్రి అవార్డులకు దక్షిణమధ్యరైల్వే నుంచి ఇద్దరు ఆర్పీఎఫ్ సిబ్బంది ఎంపికయ్యారు. వీరిలో ఒకరు సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోస్ట్‌లో పనిచేస్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ నాగార్జునరెడ్డి కాగా, మరొకరు హైదరాబాద్ డివిజన్ ఉమ్దానగర్‌లో పనిచేస్తున్న ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ దూదేకుల హుసేనయ్య ఉన్నారు. త్వరలో న్యూఢిల్లీలో జరగనున్న పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో వీరు.. రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్ చేతుల మీదుగా అవార్డులను అందుకోనున్నారు. విశిష్ట సేవా పురస్కారాలకు ఎంపికైన ఆర్పీఎఫ్ సిబ్బందికి దక్షిణమధ్యరైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, ఇతర ఉన్నతాధికారులు, ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. వెట్టిచాకిరి నుంచి 67మంది పిల్లలకు విముక్తి.. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌కి ఇన్‌చార్జ్‌గా ఉన్న టి.నాగార్జునరెడ్డి మానవ అక్రమ రవాణా ముప్పును ఎదుర్కోవడంలో అసాధారణమైన పనితీరును ప్రదర్శించారు. నాగార్జునరెడ్డి నాయకత్వంలో 67మంది పిల్లలను వెట్టిచాకిరీ నుంచి మానవ అక్రమ రవాణా దారుల నుంచి రక్షించారు. అలాగే, 'ఆపరేషన్ నన్హే ఫరిస్తే' ద్వారా మరో 187మంది మైనర్ పిల్లలను నాగార్జునరెడ్డి బృందం కాపాడింది. నాగార్జునరెడ్డి సేవలకు గుర్తింపుగా 'మహిళా బాల్ సురక్షా పదక్' అవార్డు లభించడం విశేషం. పట్టాలు దాటుతున్న వ్యక్తిని..ప్రమాదం నుంచి కాపాడి..ఉమ్దానగర్ రైల్వేస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దూదేకుల హుసేనయ్య డ్యూటీలో ఉండగా.. రైలు స్టేషన్‌లోకి వస్తున్న సంగతి తెలియక, రైలు పట్టాలు దాటుతున్న వ్యక్తిని గమనించాడు. ముంచుకొస్తున్న ప్రమాదాన్ని వెంటనే గుర్తించి సమయస్ఫూర్తితో ఆ వ్యక్తి వద్దకు పరుగెత్తి అతన్ని పక్కకు లాగి ప్రాణాలను కాపాడారు. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా హుసేనయ్య ప్రదర్శించిన సాహసం మరొక నిండు ప్రాణాన్ని కాపాడింది. హుసేనయ్య సేవలకు గుర్తింపుగా భారతీయ రైల్వే 'జీవన్ రక్షా పదక్' అవార్డుకు ఎంపిక చేసింది.

అంబేద్కర్‌నగర్ బస్తీ అధ్యక్షుడు

అంజయ్య ముదిరాజ్ మృతి



అంజయ్య (ఫైల్)

మారేడుపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్, మారేడుపల్లిలోని (రైల్ నిలయం) అంబేద్కర్‌నగర్ బస్తీ అధ్యక్షుడు, టీడీపీ బీసీ సెల్ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ అంజయ్య ముదిరాజ్ మృతిచెందాడు. కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మల్కాజిగిరి అడ్‌హక్ కమిటీ మెంబర్ జె. నర్సింగ్‌రావు, ప్రతాప్, మధుసూదన్, బస్తీవాసులు అంజయ్య మృతదేహంపై పూలమాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గురువారం మధ్యాహ్నం మారేడుపల్లి హిందూ శ్మశానవాటికలో అంజయ్య అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయండి

- రోడ్లపైన ప్రయాణికుల పడిగాపులు
- అవస్థలు పడుతున్న వృద్ధులు, మహిళలు



వారాసిగూడ చౌరస్తాలో రోడ్డుపై నిల్చున్న ప్రయాణికులు, విద్యార్థులు

బౌద్ధనగర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ప్రయాణికులు రోడ్లపై నిలబడి పడిగాపులు కాస్తున్నారు. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్ పరిధిలో చాలా చోట్ల బస్ షెల్టర్‌లు లేవు. చిలకలగూడ నుంచి జామై ఉస్మానియా వరకు ఎక్కడా బస్ షెల్టర్‌లను ఏర్పాటు చేయలేదు. దాంతో ప్రయాణికులు ఎండలో ఎండుతూ, వానకు తడుస్తూ నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లపైనే అక్రమంగా ఆటోలను పార్కింగ్ చేయటంతో కనీసం నిల్చోటానికి కూడా స్థలం ఉండడం లేదు. జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ సంస్థ రెండు విభాగాలు సమన్వయం చేసుకుని అవసరమైన చోట ప్రయాణికులకు బస్ షెల్టర్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఆదిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆధునీక బస్‌షెల్టర్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు ఈ ప్రాంతంలోనూ బస్ షెల్టర్‌లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సీతాఫల్‌మండి చౌరస్తా, నామాలగుండు చౌరస్తా, శ్రీదేవి నర్సింగ్ హోమ్ వద్ద, వారాసిగూడ చౌరస్తా, ఆర్ట్‌కాలేజీ, జామైఉస్మానియా వద్ద బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు బస్సులు కోసం రోడ్లపై నిలబడుతున్నారు. ఈ ప్రాంతాల నుంచి రోజూ వేలాదిమంది ప్రయాణికులు ఉద్యోగం, కాలేజీలు, వివిధ పనులు నిమిత్తం సికింద్రాబాద్, కోఠి, అఫ్జల్‌గంజ్, దిల్‌సుఖ్‌నగర్, మెహిదీపట్నం, శంషాబాద్, కూకట్‌పల్లి, నాచారం, ఉప్పల్, ఎల్‌బీనగర్, పంజాగుట్ట, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలకు వెళ్తుంటారు. ఈ ప్రాంతాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని గతంలో వివిధ రాజకీయపార్టీ నాయకులు, జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చౌరస్తాలలో ఆటోల పార్కింగ్

వారాసిగూడ, సీతాఫల్‌మండి చౌరాస్తాలలో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు అధిక సంఖ్య ప్రయాణికులు బస్సు కోసం నిల్చుంటారు. ఆ రెండు చౌరాస్తాలో అక్రమంగా ఆటోలను రోడ్లపై పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు ఎండలో రోడ్లపైనే నిల్చుంటున్నారు. కొంతమంది ప్రయాణికులు రోడ్లపై నిలబడలేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఎండలో నిలబలేకు కొన్ని ప్రాంతాల్లో ప్రయాణికులు రోడ్డు పక్కన చెట్ల కింద నిల్చుంటున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



వారాసిగూడ, ఆర్ట్స్‌కాలేజీ తదితర ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేవు. చాలామంది విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రోడ్లపై బస్సుల కోసం నిల్చుంటున్నారు. బస్‌షెల్టర్లు లేకపోవటంతో వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలి. బస్‌షెల్టర్లు లేని ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలి.

- వల్లారపు శ్రీనివాస్‌కుమార్, టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి

బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించాలి. బస్ షెల్టర్‌లు లేకపోవడంతో ఎండలో, వానలో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఆర్ట్స్‌కాలేజీ బస్‌స్టాపు వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటం, రోడ్లపై నిలబడలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకువస్తుందో తెలియని పరిస్థితి. ప్రయాణికులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలి

- పాతూరి మల్లేష్, శ్రీనివాసనగర్

ఏసుక్రీస్తు జీవితం ఇతరులకు ప్రేమను పంచుతోంది: గవర్నర్



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాంగోపాల్ పేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు జీవితం ఇతరులకు ప్రేమను పంచుతున్నదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ కమిటీ (యూసీసీ), తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ సంయుక్త ఆధ్వర్యంలో 16వ గ్రేటర్ హైదరాబాద్ క్రిస్మస్ ఉత్సవాలను బుధవారం సికింద్రాబాద్ పీజీ కళాశాల ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ఏసుక్రీస్తు నాడు అందించిన సందేశం అందరిని ఏకం చేస్తుందన్నారు. తాను వచ్చిన త్రిపుర రాష్ట్రంలో కులం, మతం లేకుండా అందరూ క్రిస్మస్‌ను జరుపుకోవడం అక్కడ చూశానని అన్నారు.

కార్డినల్ పూల ఆంథోనీ మాట్లాడుతూ ప్రపంచ మానవాళిని రక్షించడానికి ఏసు క్రీస్తు మానవుడి రూపంలో ఈ లోకానికి వచ్చాడని అన్నారు. శాంతికి ప్రతి రూపం ఏసుక్రీస్తు అని, ప్రపంచం మొత్తం శాంతి నెలకొనాలని ఆయన అన్నారు.

తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ప్రధాన కార్యదర్శి పాస్టర్ టీ భాస్కర్ మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం అనేది శాంతికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో యూసీసీ కమిటీ చైర్‌పర్సన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణి జీడీ అరుణ, ప్రధానకార్యదర్శి స్టీవా గెలెలీ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్, సీఎస్ఐ డిప్యూటీ మాడరేటర్ రూబెన్‌మార్క్, బిషప్ ఎంఏ డేనియల్, పాస్టర్ పురుషోత్తం తదితర ప్రముఖులతో పాటు అన్ని సంఘాలకు చెందిన బిషప్‌లు, పాస్టర్‌లు పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లిష్ టాబెర్నాకిల్స్ క్వయర్ మధురమైన పాటలను ఆలపించారు. బైబిల్ క్విజ్‌లతో పాటు క్రీస్తు జననంకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



రాజ్‌భవన్ వద్ద ఆందోళనలో విశాల్, కృష్ణ తదితరులు

రాజ్‌భవన్‌కు తరలిన కాంగ్రెస్ నేతలు

బేగంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చలో రాజ్‌భవన్ ఆందోళన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. బేగంపేట డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు విశాల్ సుధాం ఆధ్వర్యంలో సనత్‌నగర్ నియోజకవర్గంలోని కృష్ణ, అరుణ్, మునీర్‌ఖాన్, కాంగ్రెస్ నేతలు రాజ్‌భవన్‌కు వెళ్లి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ అమెరికాలో అదాని ఆర్థిక అవకతవకలకు పాల్పడి దేశం పరువు తీసినా ఎన్డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.

ఫ్యామిలీ పెన్షన్ సమస్యకు పరిష్కారం



రాఘవయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న రాంమోహన్

చిలకలగూడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతిచెందిన ఉద్యోగులు, కార్మికుల కుటుంబాల ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేయడంలో తీవ్రంగా జాప్యం జరుగుతుందని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమన్, దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య అన్నారు. ఈ విషయంపై పలు ఫిర్యాదులు రాగా, ఇటీవల నిర్వహించిన పెన్షన్ అదాలత్‌లో ప్రస్తావించి పరిష్కరించినట్టు ఆయన చెప్పారు. పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సమస్యను పరిష్కరించిన మర్రి రాఘవయ్యను చిలకలగూడలోని రైల్వే ఎంప్లాయీస్ కార్యాలయంలో ఫ్యామిలీ పెన్షన్ పొందిన రాంమోహన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అయనకు పూలమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. సి. శేషగిరిరావు విజయనగరంలో పార్సిల్ విభాగంలో సూపర్‌వైజర్‌గా పదవీ విరమణ చేసి 1996లో మృతిచెందగా, ఆయన భార్య 2014లో మృతిచెందారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు పలుమార్లు ఉన్నతాధికారులకు పెన్షన్‌కోసం దరఖాస్తు చేశారు. అయినా పెండింగ్‌లో ఉంది. ఇదే విషయమై అతడి కుటుంబ సభ్యులు మర్రి రాఘవయ్యని కలిసి విన్నవించగా, తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి పెన్షన్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. పదేళ్ల పెన్షన్ సమస్య పరిష్కారం కావడంతో రాంమోహన్ ధన్యవాదాలు తెలిపారు.

సట్టా నిర్వహిస్తున్న ముఠా అరెస్ట్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా సట్టా నిర్వహిస్తున్న నిర్వాహకులతో పాటు పంటర్లను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, షాహినాత్ గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ధూల్‌పేట జుమ్మేరాత్‌బజార్ ప్రాంతానికి చెందిన విశాల్‌సింగ్(26) విగ్రహాల తయారీతో పాటు, పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అదనపు సంపాదన కోసం పాన్‌షాప్‌లో సట్టా నిర్వహిస్తూ డబ్బు తీసుకుంటున్నాడు. ఇతడికి తాడ్‌బన్‌కు చెందిన నరేష్‌కుమార్ చౌహాన్(24), ధూల్‌పేటకు చెందిన అంకిత్‌సింగ్(22), అక్షయ్‌సింగ్(26) సహకరించేవారు. సమాచారమందుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, షాహినాత్‌గంజ్ పోలీసులు బుధవారం నలుగురు నిర్వాహకులతోపాటు మరో 20 మంది పంటర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మట్కా లాటరీ చార్ట్, లాటరీ చిట్టు, సట్టా చిట్టు, రూ.30,760 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఐక్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి : కార్పొరేటర్ హేమ



వెస్లీ చర్చిలో కేక్‌కట్ చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

బౌద్ధనగర్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): సర్వమతాలు ఐక్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతున్నదని కార్పొరేటర్ సామల హేమ పేర్కొన్నారు. ఏసు క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ అందరికీ ఆదర్శమని ఆమె అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్, చిలకలగూడలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ క్రిస్మస్ కేక్ కట్‌చేసి ముందస్తుగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో కమిటీ సభ్యులు. జోనావిన్సెంట్, సుధాకర్, విల్సన్, బెంజిమన్ జ్యోతి, గుంటికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

చిలకలగూడ, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్యరైల్వే సికింద్రాబాద్, హైదరాబాద్ భవన్, గులిస్తాన్‌హాల్‌లో బుధవారం అకౌంట్స్ సిబ్బంది కేక్ కట్ చేసి ప్రీ క్రిస్మస్ వేడుకలు ఆనందంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని సినీయర్ డివిజనల్ ఫైనాన్షియల్ మేనేజర్ రాజాదొరై పెర్కొన్నారు. కార్యక్రమంలో జేసుదాసు, సాలన్ సంగా, రమణ, షేక్ రవూఫ్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రీ క్రిస్మస్ వేడుకల్లో హైదరాబాద్ డివిజన్ అకౌంట్స్ ఉద్యోగులు



ధర్నాలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలి

కవాడిగూడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టిజన్ కార్మికుల విద్యార్హతలను పరిగణలోకి తీసుకుని జూనియర్ లైన్‌మన్, సబ్ ఇంజనీరు, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేటర్‌లు కన్వర్షన్ చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజెన్స్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌లో భాగంగా బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యుత్ కార్మికుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఆర్టిజన్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే అసెంబ్లీ సమావేశాల తరువాత సీఎం రేవంత్‌కు లేఖ రాసి, ఆయనను కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. జేఏసీ చైర్మన్ కె ఈశ్వర్‌రావు, కన్వీనర్ ఎంఏ వజీర్ మాట్లాడుతూ.. ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ ఇచ్చిన తరువాతనే జూనియర్ లైన్‌మన్, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జేఏసీ కో చైర్మన్ చింత ఎల్లయ్య, బి శంకర్, కోకన్వీనర్లు జి నాగరాజు, అరవింద్‌కుమార్, ప్రసాద్, సదానందం, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ ఎస్‌డీ రోడ్డులోని ముచ్చర్ల మెన్షన్‌లో అయ్యప్ప స్వాములకు రాగిల్లి ఆనంద్‌బాబు గౌడ్, ముచ్చర్ల కృష్ణ, శివనారాయణ, వినయ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్ అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం అందజేశారు.

- *(రాంగోపాల్‌పేట్-ఆంధ్రజ్యోతి)*

పార్కులను అభివృద్ధి చేయండి



బ్యాంకు కాలనీలోని పార్కులో పెరిగిన పిచ్చి మొక్కలు

కూలిన పార్కు గోడలు

మారేడుపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు, నాలుగో వార్డు పరిధిలోని బ్యాంకుకాలనీలో ఉన్న పార్కులు నిరుపయోగంగా మారాయి. పార్కు చుట్టూ ఏర్పాటు చేసిన గోడలు కూలిపోయాయి. పిచ్చి మొక్కలు పెరిగి డంపింగ్ యార్డుగా మారింది. కంటోన్మెంట్ బోర్డు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాలనీలలోని పలు పార్కులు అధ్వానంగా మారాయని స్థానికులు మండిపడుతున్నారు. గోడలు కూలి ఐదేళ్లు అవుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా మారిని పార్కులు అభివృద్ధి చేయాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని బ్యాంకు కాలనీ అధ్యక్షుడు వీరేశం తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు అధికారులు చర్యలు తీసుకుని పార్కును అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.